# గాడిద పోట్లు

## కటువకోలను సదానంద

పాఠకమహాశయులారా ! మీరు నన్ను క్షమించాలి నాలాంటి గాడిద శాసన సభ్యుడైతే దేశం బాగుపడిపోతుందనీ, శాసనసభ్యులు మామూలుగా దిగమింగే రొక్కరోజనాలంతా మిలిగిపోతుందనీ, మీ అందరి అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో నేను పోటీ చేయబోతున్నాననీ, అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపించి తీరాలనీ మీరు ఉవ్విళ్ళూరుతూ వుండవచ్చు మిమ్మల్ని నిరుత్సాహపరిచినందుకు నేను ఎంతైనా చింతిస్తున్నాను. ఇంతకీ నేను నామినేషనైనా దాఖలు చేయలేదు.

ఈ పదవి వుంది చూశారా - ఇది

**ఎందరో త్యాగరాజులు !**

మత్తు పానీయంలాంటిది. అది ఆలోచించనీయదు. నిజానిజాల్ని తెలుసుకోనీయదు. ఆ మత్తులోపడి నేనూ పోటీ చేయాలనుకున్నాను గానీ-గాడిద గెలవడమంటే మాటలా ? ఎన్నికల్లో గెలవటానికి మంచితనం ఒక్కటే చాలదు. అసలు మంచితనం ఎవడికి కావాలి ? కావాల్సినవి బోలెడున్నాయి. కరపత్రాలు, వాల్ పోస్టర్లు గోడలు ఖరాబు చేయటానికి చిత్రకారులు, జీపులు, వ్యానులు, పెట్రోలు ఖర్చులు, ఓట్లు కొనెయ్యటానికి డబ్బు, మందీ, మార్బలం, కులం, బలం, నాటకం, బూటకం ఇవన్నీ కావాలి. ఇన్ని వున్నా గెలవటం కష్టమైపోతూవుంటుంది. ఏమీలేనివాడిని-వుత్తమంచివాడిని వుత్తయోగ్యుడిని-నేను గెలవడం సాధ్యమా ?

అందుకే అన్నీ ఆలోచించి ఎన్నికల్లో పోటీ చేయాలన్న కోరికకు స్వస్తి చెప్పాను. ఇప్పుడు నేను ఎన్నికల్లో పోటీ చేయడంలేదు.

అయితే-నాబొమ్మ గోడమీద కనిపించింది. 'గాడిదకే మీ ఓటు' అనే రాతలు కూడా కనిపించాయి. అది చూచి ఆశ్చర్యాన్ని వర్ణించటానికి మీ రచయిత వాడుతున్న కలంకూడా చాలదు. ఆశ్చర్యంలోంచి తేరుకోవడానికి నాకు కొంత సేపు పట్టింది.

గోడమీద గాడిదబొమ్మ. పక్కన-'దేశం బాగుపడాలంటే-మీ పవిత్ర మైన

ఓటును గాడిదగుర్తుపై ముద్రించి శ్రీ త్యాగరాజుగారినే గెలిపించ ప్రార్థన !'

ఆనందంతో నాశరీరం గగుర్పొడిచింది. త్యాగరాజుపైన సోదరప్రేమ పొంగి పరవళ్ళు తొక్కింది.

త్యాగరాజు నాకు బాగా తెలుసు. వీధుల్లో ప్రతిరోజూ అతన్ని చూస్తుంటాను. తెల్లటి ధోవతీ లాల్చీ తొడుక్కుని, చేతులూపుకుంటూ ఠీవిగా నడిచిపోతుంటాడు. డబ్బు, హోదా, పలుకుబడి వున్న వాళ్ళకు తానే మొదట నమస్కారం చేస్తాడు. అవేవీ లేనివాళ్ళకు మాత్రం పొలుమాలికలేకుండా ప్రతినమస్కారం చేస్తాడు. పెద్దవాళ్ళను అన్నా అనీ, చిన్నవాళ్లను నాయనా అనీ అంటాడు. పంచాయితీ ఎన్నికలు మొదలు పార్లమెంటు ఎన్నికలదాకా పోటీచేస్తూ-ఓడిపోవడమో, లేదా ఉపసంహరించు కోవడమో చేస్తుంటాడు. ఇదే అతనివృత్తి.

ఇప్పుడతను శాసనసభకు పోటీచేస్తున్నాడు. అతడి ఎన్నికలచిహ్నం గాడిద. అంటే నేను. మన నియోజక వర్గమంతటా ప్రతివాడలోనూ, ప్రతిగోడపైనా, నాబొమ్మే! 'దేశం బాగుపడాలంటే గాడిద గుర్తుకే మీఓటు' అనే నినాదమే ! నేను స్వయంగా పోటీ చేయకపోయినా, చేసినంత ప్రచారం లభించబోతున్నది. ఎవరి వలన ? త్యాగరాజుగారి దయవలన ! అతడి బట్టలు ఎన్నిజన్మలు మోస్తే ఈ ఋణం తీర్చుకోగలనో ?

ఎంత మంచివాడు త్యాగరాజు ! ఎన్నో గుర్తులుండగా నన్నే ఎందుకు కోరుకున్నాడు ? అతన్ని కలుసుకుని నా హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపి రావాలి.

త్యాగరాజును వెతక్కుంటూ బయలుదేరాను. ఆడబోయిన తీర్థమెదురైనట్లు త్యాగరాజే ఎదురుపడ్డాడు. అతడు ఠీవిగా చేతులు వూపటంలేదు మాటిమాటికీ చేతులుపైకెత్తడం, దించడం బాధాకరంగా తోచిందేమో-జోడించిన చేతులు జోడించినట్లే పట్టుకుని నడిచి వస్తున్నాడు. తెల్లగా వుండే అతని బట్టలు దుమ్ముకొట్టుకు పోయాయి

దగ్గరకు రాగానే త్యాగరాజు ఆగి నాముఖాన ఓచిరునవ్వు విసిరి, 'నాయనా నమస్కారం ?" అన్నాడు.

'నాకెందుకు సోదరా నమస్కారం? నాకు ఓటుహక్కులేదే !' అన్నాను.

"లేకపోతేనేం నాయనా ! నువ్వునా



ఎన్నికల చిహ్నానివికదా ! నా విజయ చిహ్నానివిగదా ? నేను గెలవాలని మన సారా ఆశీర్వదించు నాయనా !" అంటూ నా ముందర మోకరిల్లాడు త్యాగరాజు.

'విజయోస్తు !' అంటూ ఆశీర్వదించాను.

మోకాళ్ళకు అంటుకున్న దుమ్ము దులుపుకుంటూ పైకిలేచాడు త్యాగరాజు. 'నేను నీకోసమే వస్తున్నాను నాయనా ! దేవుడల్లే నువ్వే ఎదురు పడ్డావు...' అన్నాడు.

చిత్రంగావుంది. నేను నీకోసమే వస్తున్నాను ... అన్నాను.

'ఎందుకు ?'

'నాకు చాలాసంతోషంగా వుంది. ఎన్నో గుర్తులున్నాయి కదా ! నాగుర్తే ఎందుకు ఎంచుకున్నావు సోదరా ?'

'నాయనా ! నేను సమాజంలోవున్న బాధితుల్నీ, పీడితుల్నీ, బానిసల్నీ, ఉద్ధరించటంకోసం ఎన్నికల్లో నిలబడుతున్నాను. అందుకే గాడిద గుర్తును ఎంచుకున్నాను. నేను గెవలడం జరిగితే గాడిదను గుర్రం చేసితీరుతాను.'

'ఎన్నికల చిహ్నాల్లో గాడిదగుర్తు లేదే, నీకెలా యిచ్చారు సోదరా ?'

'నాకు గాడిదగుర్తే కావాలని ఎలక్షన్ కమీషన్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహంచేసి, ఈ గుర్తు సాధించాను నాయనా ! ప్రజలకోసం అలాంటి సత్యాగ్రహాలు చేయకతప్పదు కదా నాయనా !'

'సోదరా ! కొత్తసున్నానికి మల్లే తెల్లగా వుండే నీ బట్టలు యిలా దుమ్ము గొట్టుకున్నాయి ఎందుకు సోదరా ?'

'కాలము చాలా విలువైనదని నీకు తెలియదా నాయనా ! నాకర్మకొద్దీ ఈ నియోజక వర్గం కాస్తపెద్దది. ఓట్లకోసం నిద్రాహారాలు మాని ప్రజల దగ్గరికి తిరుగుతున్నాను. బట్టలు మార్చుకుందామన్నా తీరికలేదు. ఇంకెన్నాళ్ళులే ! చీకటికొన్నాళ్ళు వెన్నెలకొన్నాళ్ళు !... నాయనా! నువ్వునాకొక గొప్ప సహాయం చేయాలి !'

'ఏంచెయ్యమంటావు ? మా మల్లిన్నతో చెప్పి నీకు ఓటు వేయించమంటావా ?'

'అంతకంటే మహోపకారం ఒకటి చేయాలి సోదరా ! ప్రజల దగ్గరకు వెళ్ళాలంటే వాహనంకావాలి. నాకు వాహనాలులేవు. డబ్బులులేవు. నువ్వు సమ్మతిస్తే, నీపైన కూర్చుని పల్లెలన్నీ తిరుగుదామను కుంటున్నాను. ఓటర్లందరినీ కలుసుకుందా మనుకుంటున్నాను. నేను గెలిచిన తర్వాత నీమేలు మరచిపోను. నీకు ప్రత్యుపకారంగా చరిత్రాత్మకమైన పని ఒకటి చేస్తాను.'

'ఏం పనిచేస్తావు సోదరా ?'

'నేను గెలిచిన తర్వాత మంత్రి

నౌతాను. లేదా మంత్రులందర్నీ బుట్టల్లో వేసుకుంటాను. ఇప్పుడున్న ప్రభుత్వ వాహనాలన్నీ తీయించేసి, వాటిస్థానంలో గాడిదల్ని పెట్టిస్తాను గాడిదను గుర్రంగా చేసి తీరుతాను. నాయనా, నావేడికోలు మన్నించవూ ?'

'సరే, ఎక్కు !' అన్నాను.

త్యాగరాజు నావీపున ఎక్కి కూర్చున్నాడు. అతడి సూచనమేరకు దగ్గరలో వున్న ఒక చిన్న పల్లె చేరుకున్నాను. రచ్చబండ దగర నిలబడి బిగ్గరగా ఓండ్రపెట్టాను. పల్లెలోని ముసలీ ముతకా, పిలాజెల్లా, ఆడా మగా అందరూ బిలబిలమంటూ వచ్చి మా చుట్టూ ముగారు. త్యాగరాజు చెంగున రచ్చబండ మీదకి గెంతి నిలబడ్డాడు.

'ఓటరు మహాశయులారా ! మీరు ఎందరున్నారో అందరికీ అన్ని వందనములు ! మీకు నేను చెప్పేదేమంటే- ప్రభుత్వములో బందిపోట్లు పెరిగిపోయారు. ప్రజలపేరుతో దేశాన్ని దోచుకు తినేస్తున్నారు. మీరింక నిద్రపోవటానికి వీల్లేదు. మీ చేతుల్లో ఓట్లున్నాయి. దయచేసి నన్నే గెలిపించడి. నేను గెలిస్తే పేదవాళ్ళను ప్రభువులుగా మార్చేసాను, పన్నులనేవే లేకుండా చేస్తాను...ఇదిగో, ఈ గాడిదను చూడండి, నా ఎన్నికల చిహ్నం గాడిద ! మీ ఓటు గాడిద గుర్తుపై ముద్రించ ప్రార్థన !'

త్యాగరాజు ఉపన్యాసం ముగించి మళ్ళీ నా పైన ఎక్కికూర్చున్నాడు. పక్కనున్న మరో పల్లెవైపు నడవమన్నాడు.

నడుస్తున్నాను.

మాటిమాటికీ 'అంతా ఆ ఏడుకొండల వాని దయ !' అంటున్నాడు తాగ్యరాజు.

'సోదరా ! ఈ ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తామనే నమ్మకం నీకుందా?' అని అడిగాను.

'ఈ అనుమానం ఎందుకొచ్చింది నాయనా నీకు ? నేను గెలిస్తే వెంకటేశ్వరుడికి తల నీలాలిస్తానని మొక్కుకున్నాను. ఆదేవుణ్ణి నమ్మి చెడినవాళ్ళులేరు.'

'తలనీలాలిస్తామని అందరూ మొక్కుతున్నారులే ! నువ్వు గెలిచేందుకు యింకా ఏఏ అవకాశాలున్నాయి ?'

'నీకు తెలియదా నాయనా ? పోటీ చేస్తున్న అభ్యర్థులలో నాకులం వాడిని నేనొక్కణ్ణే ! ఇతర కులాల ఓట్లు చీలిపోతాయి. నాకులం వాళ్ళందరూ వేసినా చాలు, నేనే గెలిచిపోతాను. ఇంకో విషయం చెప్పలేదు కదూ నీకు ? ఒక గొప్ప జ్యోతిష్కుడు - అంతటివాడు ఇండియాలో మరొకడు లేడు - నా చెయ్యి చూచి, ఎలక్షన్‌లో నువ్వు నిలబడవయ్యా త్యాగరాజూ, నువ్వు మంత్రి కాకపోతే నావృత్తి మానేస్తాను ... అన్నాడు. ఆ మహానుభావుడి మాట

ఎప్పుడూ పొల్లుపోలేదు...రోజులు మారాయిలే నాయనా! దొంగలకు రోజులు దగ్గర పడ్డాయి...'

నేను మౌనంగా నడుస్తున్నాను. త్యాగరాజు ఉల్లాసంగా పాటపాడుతున్నాడు

'ఎమ్. ఎల్. ఏ. సీటు వచ్చునుగా!
త్యాగరాజు గెలుచునుగా,
ఆశలన్నీ తీరునుగా,
బ్రతుకెంతో హాయిగా...'

పాట ఆపి యిలా అన్నాడు! 'కష్టాలు కలకాలం వుండవు నాయనా! మనిషి సుఖపడేరోజులు కూడా వస్తాయి. పేదరికంలో పుట్టాను. పేదరికంలో పెరిగాను. నాకు ఏలినాటిశని తీరిపోయింది. ఏనాటికైనా ఒకనాటికి నేను పదవిలో వుంటానని, బంగళా, కారూ, డబ్బూ, పలుకుబడీ అన్నీ సంపాదించుకుని దర్జాగా బ్రతుకుతాననీ నాజాతకంలో రాసి వుంది. నారు పోసినవాడు నీరు పొయ్యక పోతాడా నాయనా? ఎమ్. ఎల్. ఏ. సీటూ వచ్చునుగా, త్యాగరాజు గెలుచునుగా... లలలా.. లలలా లల...' త్యాగరాజును యిక మోయలేకపోయాను. ఇతను శాసనసభ్యుడు కావాలనుకుంటున్నది ఎవరికోసం? దేశం కోసమా? ప్రజల కోసమా? దేశమంటే త్యాగరాజా? ప్రజలంటే త్యాగరాజా?

దారి పక్కన పాడు పడిన బావి ఒకటి కనిపించింది. అక్కడ ఆగాను. త్యాగరాజుగాడి కళ్ళు తిరిగిపోయేలా గెంతడం ప్రారంభించాను. త్యాగరాజు ఎగిరి పడ్డాడు. దడదడమంటూ గోతిలోకి దొర్లిపోయాడు.

ఓటరు మహాశయులారా! త్యాగరాజును గురించి యిక మీరు భయపడాల్సిన అవసరంలేదు. ఓట్లకోసం అతడు మళ్ళీ మీ దగ్గరకు రాడు. మిమ్మల్ని విసిగించడు తనకాళ్ళకు చేతులకూ వున్న కట్లు విప్పించుకుని మళ్ళీపైకిలేచి తిరిగేసరికి ఎన్నికలుకాస్తాఅయిపోతాయి.

ఈలోగా మీఓటు ఎవరికైనా వేసుకోండి, మీయిష్టం!

దేశం బాగుపడాలంటే ......?*

ప్రజాతంత్రలో ప్రకటనలు

మీ వ్యాపారాభివృద్ధికి

దోహదం చేస్తాయి